www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 23 ఏప్రిల్ 2023

చిత్తూరు జిల్లా అభివృద్ధిపై 'ముఖాముఖి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా అభివృద్ధిపై ముఖాముఖి చర్చ ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించనున్నట్లు పౌరసంఘాల సమాఖ్య నాయకులు చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా కేంద్రంగా 1911 ఏప్రిల్‌లో ఏర్పాటు అయిన విషయం అందరికీ తెలిసిందే. జిల్లా కేంద్రం చిత్తూరు ఉందేగాని అభివద్ధి మాత్రం అంతంత మాత్రమే ఉంది. రాజకీయాలకు అతీతంగా చిత్తూరు నగరంలో ఉన్న వివిధ ప్రజాసంఘాలు, అసోసియేషన్‌లు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, చిత్తూరు అభివృద్ధి కావాలనే వారితో కలిపి ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు చిత్తూరు రైతుబజార్ పక్కన ఉన్న ఎన్‌జీఓ హోమ్‌లో జరుగుతుంది. చిత్తూరు జిల్లా అభివృద్ధిని కాంక్షించే వాళ్ళు తప్పనిసరిగా హాజరై మీ విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ముఖాముఖి చర్చకు రాలేకపోతే మీమీ సంఘాలు, అసోసియేషన్, స్వచ్ఛంద సంస్థల సూచనలు పి.చైతన్య నెంబర్ 94903 00770 పంపాలని పేర్కొన్నారు.

రుయా...లేదా మాపై దయ..!

- 506 మందికి గాను కేవలం 95 మందితోనే పనులు
- వారిలోనూ తరచూ 10 మంది గైర్హాజరు
- నియామకాలు చేపట్టకుండా అధికారుల నిర్లక్ష్యం
- ఆధిపత్యం కోసం రెండు గ్రూపులు పట్టు
- ఫలితంగా పోస్టుల భర్తీలో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి- తిరుపతి : వైద్యరంగంలో రాయలసీమకే తలమానికంగా నిలుస్తూ, పేద ప్రజల ఆరోగ్య పెన్నిధిగా విరాజిల్లుతోన్న తిరుపతి రుయా ఆసుపత్రిలో నాలుగో తరగతి సిబ్బందిపై తీవ్ర పనిభారం పడుతోంది. 506 మంది చేయాల్సిన పనిని కేవలం 95 మందితో సరిపెడుతున్నారు. పైగా వారిలోనూ మరో 10 మంది అనారోగ్యం, వివిధ కారణాలతో పనులకు గైర్హాజరు అయ్యే పరిస్థితి నెలకొంటోంది. గత పదేళ్లుగా రుయాలో కీలకంగా పనిచేసిన ఓ అధికారే ప్రస్తుతం జిల్లా అధికారిగా ఉన్నా తమ సమస్యలు పట్టించుకోలేదన్నది వారి ఆవేదన. రుయాలో ఉన్న అధికారులు సైతం ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తూ సమస్యను మరింత జఠిలం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే తమకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని రుయా సిబ్బంది వాపోతున్నారు. ఇవేమీ తమకు పట్టనట్లు అటు ఉన్నతాధికారులు, ఇటు హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ చోద్యం చూస్తుండటం గమనార్హం. ఫలితంగా అటు వైద్య సిబ్బంది, ఇటు నాలుగోతరగతి ఉద్యోగులపై తీవ్ర పనిభారంతో నలిగిపోతుండటం శోచనీయం. తాజాగా తమ పనిభారాన్ని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి దృష్టికీ వారు తీసుకెళ్లారు.

రాయలసీమకే ధర్మాసుపత్రిగా పేరొందిన రుయా ఆసుపత్రిలో 1182 పడకలు ఉన్నాయి. ప్రతిరోజూ సగటున 700 నుంచి 800 మంది ఓపీ సేవలకోసం రోగులు వస్తున్నారు. రుయాలో 506 మంది నాలుగవ తరగతి సిబ్బంది అవసరం ఉండగా వారిలో ప్రస్తుతం 95 మంది మాత్రమే ఉన్నారని, సాధ్యమైనంత త్వరలో సిబ్బంది నియామకాలు చేపట్టాలని హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీతో పాటు ఉన్నతాధికారులకూ రుయా సూపరింటెండెంట్‌గా గతంలో పనిచేసిన డాక్టర్ భారతి అప్పట్లోనే విన్నవించినట్లు తెలుస్తోంది. అయితే అప్పటి నుంచి నియామకాల భర్తీ సమస్యాత్మకంగా మారింది. ఇక్కడే కీలకంగా పనిచేసిన ఓ అధికారి ప్రస్తుతం ఉన్నతాధికారిగా ఉండటంతో వివాదం మరింత ముదిరినట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న అధికారులు సైతం నియామకాల పట్ల చొరవ చూపకపోవడమే కాకుండా ప్రశ్నించిన వారిపట్ల అవమానకరంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది సమస్యల్ని తెలుసుకుని, వాటిని పరిష్కరించి అండగా నిలవాల్సిన యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తీవ్ర పనిభారంతో పాటు, సెలవులూ ఇవ్వడం లేదని, పని గంటలు పాటించడం లేదని, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డికి ఇటీవలే యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో పాటు రుయా అధికారుల్లోనూ స్పందన లేకపోవడం గమనార్హం.

పీఎస్ఎల్వీ -సి55 రాకెట్ సక్సెస్

'షార్' శాస్త్రవేత్తలకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ షార్ నుంచి పిఎస్–ఎల్వి–సి55 రాకెట్ ప్రయోగం ఘన విజయం సాధించింది. శనివారం మధ్యాహ్నం 2 గంటల 20 నిమిషాలకు ఇస్రో పీఎస్ఎల్వీ -సి55 రాకెట్ ద్వారా సింగపూర్ కు చెందిన టెల్ ఇయోస్ -2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపింది. ఇస్రో ఛైర్మన్‌తో పాటు షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, బి.ఎన్ రామకష్ణ, డైరెక్టర్ ఐఎస్ టి ఆర్ ఎ సి నారాయణ, డైరెక్టర్ ఎల్పీఎస్సీ, రాధాకష్ణన్, సిఎండి ఎన్ఎస్ఐఎల్ ఎం శంకరం, డైరెక్టర్ యు ఆర్ ఎస్ సి ఎస్సార్ బీజు, మిషన్ డైరెక్టర్ ఉన్నికష్ణన్, డైరెక్టర్ వి ఎస్ ఎస్ సి తదితరులు పాల్గొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థాన ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, సిపిఎం నాయకులు బి పద్మనాభయ్య, ఎస్ సాంబశివరావు, సిహెచ్ సుధాకర్ రావు, సుంకర అల్లయ్య తదితరులు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

షార్‌లో పిఎస్ఎల్వి -సి 55 రాకెట్ చూడడానికి విచ్చేసిన జనం, శాస్త్రవేత్తలకు అభినందనల వెల్లువ

ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి

సహకారం అందిస్తా : కలెక్టర్

ఆఫీసర్స్ క్లబ్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్, ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షులు షన్మోహన్ తెలిపారు. శనివారం కొంగారెడ్డిపల్లిలో ఉన్న ఆఫీసర్స్ క్లబ్‌ను కలెక్టర్ పర్యవేక్షించారు. సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం క్లబ్‌లో ఉన్న షటిల్ కోర్టు, తదితర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆఫీసర్స్ క్లబ్ అభివద్ధికి సహకరిస్తామన్నారు. వ్యాయామం జీవితంలో ఒక భాగం అయినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానంద రెడ్డి మాట్లాడుతూ ప్రముఖులు, మేధావివర్గం ప్రాతినిధ్యం వహించే చిత్తూరు ఆఫీసర్స్ క్లబ్ జిల్లాకే గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ జాయింట్ సెక్రెటరీ రవి, ట్రెజరర్ నరసింహారెడ్డి, సెక్రటరీ రామకష్ణారెడ్డి, క్లబ్ మాజీ సెక్రెటరీ టీవీఎన్ నాయుడు, సభ్యులు నరసింహారెడ్డి, ఆనందరెడ్డి, సీఆర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం

తాగునీటి ప్లాంట్ ఏర్పాటు

వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నగరంలో గాంధీ విగ్రహ కూడలి వద్ద తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. చిత్తూరు లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఏర్పాటు చేయనున్న మినరల్ వాటర్ ప్లాంట్ కోసం గాంధీ విగ్రహ కూడలిలో 1వ పట్టణ పోలీసుస్టేషన్ వద్ద స్థలాన్ని కమిషనర్ శనివారం ఉదయం పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు గాంధీ విగ్రహ కూడలికి చేరుకుని అక్కడ నుంచి బస్సుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్తారని, నిత్యం వేలాది మంది ప్రజలు ఇక్కడ వేచి ఉంటారని వీరి దాహార్తి తీర్చేలా శాశ్వతంగా తాగునీటిని అందుబాటులో ఉంచేందుకు వీలుగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు లయన్స్ క్లబ్ ముందుకు వచ్చిందని తెలిపారు. ఈనేపథ్యంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి అనువైన స్థలం కోసం కమిషనర్ నగరపాలక ఇంజనీరింగ్, ప్రణాళిక విభాగం అధికారులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం కమిషనర్ ఆర్టీసీ బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇదివరకే ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సందర్శించారు. అంతకుముందు కమిషనర్ నగరంలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ మార్గంలోని ఏఎస్ఎం కాంప్లెక్స్ వద్ద పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రంజాన్ సందర్భంగా సంతపేట మసీదు వద్ద చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం సంతపేటలోని పలు ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ప్రధానమార్గాల్లో స్లీపింగ్ పనులను ఉదయం వీలైనంత త్వరగా పూర్తి చేయించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఏసీపీ రామకష్ణుడు, డీఈ రమణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు, నగర పాలక అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

జెడ్‌పి సీనియర్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పురుషోత్తం రెడ్డి శనివారం అనారోగ్యంతో మతి చెందారు. దీంతో మురకంబట్టులోని పురుషోత్తం నివాసానికి జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి వెళ్లి సంతాపాన్ని ప్రకటించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి జెడ్‌పి నుంచి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు.

కరోనా ముప్పు తొలగేనా..!

జాగ్రత్తలు తప్పనిసరి..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

కరోనా ముప్పు తొలగిపోలేదు... మొదటి, రెండు, మూడో దశలను వైద్య ఆరోగ్యశాఖ సమర్థవంతంగా ఎదుర్కోవడం జరిగింది. రెండు, మూడో దశ కరోనాలో ప్రాణనష్టం కలిగించిది. ప్రస్తుతం తిరిగే ప్రపంచ వ్యాప్తంగా కరోనా విస్తరిస్తోంది. వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరిగా బూస్టర్ డోస్‌లు తీసుకొని వారికి సంబంధిత పిహెచ్‌సి, సిహెచ్‌సి, అర్బన్ హెల్త్‌సెంటర్ల ద్వారా బూస్లర్ డోసులు వేస్తున్నారు. మాస్కులు, శ్యానిటైజర్లు వాడాల్సి ఉంది. సభలు, సమావేశాల్లో వ్యక్తిగత దూరం పాటించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కరోనావైరస్ సోకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో నాలుగో దశ కరోనా లక్షణాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ పరిస్థితిని అంచనా వేస్తోంది. ఏప్రిల్ చివరి వారం నుండీ మాస్కులు, శానిటైజర్ల వాడకం తప్పనిసరి చేయనున్నట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు డబ్ల్యూహెచ్‌ఓ, ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆదేశాలు అందనప్పటికి కరోనా జాగ్రత్తలు పాటించాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

కోవిడ్ టీకాలు ఇప్పటికే మూడు దశల్లో వేశారు. తాజాగా 12 ఏళ్ళ పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోంది. వృద్ధులు, మధ్య వయసు వారు మొదటిదశ టీకాలు వేసుకొనేందుకు చూపినంత ఆసక్తి రెండో దశ టీకాలు, బూస్టర్‌డోల్ టీకాల విషయంలో

చూపడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టకొని ఐసిఎంఆర్ పంపిణీ వాహనాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింకీ వెళ్లి టీకాలు వేస్తున్నారు. కేసులు తగ్గినంత మాత్రనా అంతాబాగుందని భావించి అశ్రద్ధ వహించరాదని వైద్యశాఖాధికారులు చూస్తున్నారు. మూడో దశలో కోవిడ్ పాజిటివ్ వచ్చినా అధికశాతం మంది హోం ఐసోలేషన్లో ఉంటున్నారు. దీనికితోడు సొంతంగా దుకాణానికి వెళ్లి వారు ఇచ్చిన మందులను వినియోగిస్తున్నారు. చిన్నపాటి లక్షణాలు ఉన్నా భయపడటం లేదు. దీంతో కోవిడ్ ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య తగ్గుతోంది. తీవ్రఅస్వస్థతకు గురైతే తప్ప అసుపత్రి మెట్లు ఎక్కడం లేదు.

కరోనా లెక్కలు..

జిల్లాలో కరోనా పరీక్షలు 25,99, 428, పాజిటివ్ కేసులు లక్షా 89, 890, మొత్తం రికవరీ కేసుల 1,166, పాటిటివిటి రేటు 7.27 శాతం, రికవరీ రేటు 99.36శాతం, మరణాల శాతం 0.61శాతం. ఇక టీకాల విషయానికి వస్తే మొత్తం కోవిడ్ టీకాలు తీసుకున్న వారు 74,51,008 మొదటి డోస్ తీసుకున్నవారు 36,93,655, రెండో డోస్ తీసుకున్నవారు 36,37,373 మూడోవ డోస్ (ప్రికాషనరిడోస్) తీసుకున్నవారు 1,19, 980 మంది.

బూస్టర్ డోస్ తప్పనిసరి..

బూస్టర్ డోస్ తప్పనిసరి ఎందుకంటే వ్యాధినిరోధక శక్తి పెరిగేందుకు ఇది దోహదపడుతుంది. ఫలితంగా కోవిడ్ నాలుగో దశలో ఇబ్బంది పడకుండా ఉండేందుకు వీలవుతుంది. ప్రజలు ఇంట్లో ఉన్నా.. ఎక్కడకి వెళ్లినా కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఇంట్లో ఉండటం సురక్షితం ఎందుకంటే వీరిలో వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. బూస్టర్ డోసులు అందుబాటులో ఉంచారు.

వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి..

కరోనాపై ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలు అందనప్పటికీ నాటి వరకు బూస్టర్ డోసు వేసుకోనివారు బూస్టర్‌డోస్ టీకాలు వేయించుకోవడం మంచిది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొవడానికి వైద్యఆరోగ్యశాఖ సిబ్బందిని సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో పిహెచ్‌సీలలో కరోపా పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో కరోనా సోకిన వ్యక్తులను చికిత్స అందించేందు ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయడం జరిగింది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. కరోనా అని నిర్ధారణ అయిన వెంటనే సమీపంలో క్వారంటైన్ కేంద్రాలను తరలించడం జరుగుతోంది. ప్రస్తుతానికి జిల్లాలో పెద్ద కరోనా ప్రభావం కనిపిచడం లేదు.

- డాక్టర్ ప్రకాశం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

ఆవులపల్లె ప్రాజెక్టు పనుల పరిశీలన

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఆవులపల్లె సమీపంలో 3.5 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ సుమారు 700కోట్ల రూపాయల నిధులతో ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందని 60వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం ప్రాజెక్టు వల్ల కలుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతంగా చేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జడ్పీ ఛైర్మన్, అధికారులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆవులపల్లె ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి

దళితులను అవమానిస్తే పుట్టగతులుండవ్

నారా లోకేష్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దళితులను అవమానిస్తే పుట్టగతులుండవని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద అన్నారు. శనివారం చిత్తూరు నగరంలో నారా లోకేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గంలో ఎస్సీలతో నిర్వహించిన సమావేశంలో విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు పెడతారా అని.. ఓ దళిత సోదరుడు ప్రశ్నించారని అంబేద్కర్ ఏమీ పీకాడని, ఏమీ పొడిచాడని ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారని దళితులపై నారా లోకేష్ మండిపడటం సరికాదన్నారు. దళితులుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని చంద్రబాబు గతంలో హేళన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. యువగళం పాదయాత్రలో లోకేష్ దళితులపై తన చిన్నచూపును చాటుకున్నారని అన్నారు. దళితులు పీకింది ఏమీ లేదని తక్కువ చేసి మాట్లాడారని, దళితులపై జగనన్నకు ప్రేమ ఎక్కువ అని అందుకే రిజర్వేషన్ ప్రకారం వారికి పదవులు ఇస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా దళితుల కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి చిత్తశుద్ధి చాటుకున్నారని కొనియాడారు. చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, కార్పొరేటర్ హరిణిరెడ్డి, సర్పంచ్ అమర్నాథరెడ్డి నాయకులు భూపేష్ గోపినాథ్, శ్రీధర్ రెడ్డి, లోకేష్, నారాయణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధికి బిజెపి అడ్డు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : ఎక్కడైనా రాజకీయ పార్టీలంటే ప్రజల ప్రయోజనాలు మిన్నగా భావించి ఆందోళన చేస్తుంటారు. తిరుపతిలో బిజెపి అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. తిరుపతి అభివృద్ధిని ప్రతిసారీ అడ్డుకుంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులకు గురిచేయడం పరిపాటయ్యింది. తిరుపతిలో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పలు రాజకీయ పార్టీలు అధికార పార్టీ దృష్టికి తీసుకొచ్చాయి. ఇందుకోసం ఫ్లైఓవర్ ఒక్కటే సరైన మార్గమని, ఈ మేరకు టిటిడి సహకరించాలని తెలుగుదేశం హయాంలో రూపకల్పన చేశారు. వైసిపి హయాంలో ఇప్పటికి మూడో దశ పనులు పూర్తయ్యి జఠిలంగా ఉన్న ట్రాఫిక్ సమస్య కొంతవరకూ పరిష్కారమయ్యింది. అయితే టిటిడి నిధులతో శ్రీనివాస సేతు నిర్మించరాదంటూ బిజెపి హైకోర్టును ఆశ్రయించింది. తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థమే నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును అడ్డుకోరాదని కోర్టు అక్షింతలు వేయడంతో వెనక్కి తగ్గింది. ఆ తరువాత టిటిడి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ పోస్టులను, విద్యార్థులను అన్యమతస్తులను చేర్చరాదని యాగీ చేసింది. అయితే ఇది కూడా అప్పట్లో బిజెపిపై వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి రావడంతో వెనక్కి తగ్గారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో తాత్కాలిక కలెక్టరేట్ కోసం తిరుచానూరు బైపాస్‌లో ఖాళీగా ఉన్న పద్మావతి నిలయాన్ని (కరోనా సమయంలో కోవిడ్ సెంటర్‌గా సేవలందించిన భవనం) అద్దె ప్రాతిపదికన ప్రభుత్వం తీసుకుంది. కలెక్టరేట్‌ను టిటిడి భవనాల్లో నిర్మించరాదని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోర్టుకెక్కి మరోసారి మొట్టికాయ వేసుకున్నారు. తాజాగా ఈ భవనాన్ని వంద కోట్లకు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా నుంచి కలెక్టర్ ప్రతిపాదన పంపారు. భక్తుల విరాళాలతో నిర్మించిన టిటిడి భవనాన్ని ఎలా ప్రభుత్వానికి అమ్మకానికి పెడతారంటూ విలేకరుల సమావేశంలో సెంటిమెంట్ ఆధారంగా భానుప్రకాష్‌రెడ్డి మరోసారి మాట్లాడటం గమనార్హం. అలాగే స్విమ్స్‌లో డాక్టర్లు, ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి 142 పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇవ్వగా, అన్యమతస్తులను వైద్యులుగా చేర్చడానికి వీల్లేదంటూ బిజెపి రాద్ధాంతం చేస్తూ ధర్నా చేపట్టింది. ఏది ఏమైనప్పటికీ తిరుపతి అభివృద్ధికి అడుగడుగునా బిజెపి అడ్డుపడటం, ప్రజలనుంచి వ్యతిరేకత వచ్చినా, కోర్టు మొట్టికాయలు వేసినా వెనక్కి తగ్గడం పరిపాటయ్యింది.

పద్మావతి నిలయాన్ని కలెక్టరేట్‌కు శాశ్వతంగా ఇవ్వరాదంటూ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర నాయకులు భానుప్రకాష్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయన పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని స్థానిక గ్రామంలో ముస్లిం వీధిలో మెయిన్ పైపు పగిలి తాగునీరు కరువైంది. ఈ విషయాన్ని గ్రామస్తులు స్థానిక సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డికి తెలియపరచగా సర్పంచ్ వెంటనే స్పందించి రంజాన్ పండుగను దష్టిలో పెట్టుకొని గ్రామానికి చేరుకొని కూలీల సహాయంతో పైపు మరమ్మతులు నిర్వహించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

సభ్యులకు వెండి కాయిన్ల పంపిణీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పలమనేరు బాలాజీ కోఆపరేటివ్ సూపర్‌బజార్ సభ్యులకు శనివారం బైరెడ్డిపల్లిలోని జడ్.పి.ఉన్నత పాఠశాలలో వార్షిక డివిడెండ్‌ను పంపిణీ చేసినట్లు సూపర్ బజార్ అధ్యక్షుడు ఆర్‌వి సుభాస్ చంద్రబోస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూపర్ బజార్ అధ్యక్షుడు మాట్లాడుతూ పలమనేరు బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్‌లో షేర్ పొందిన 150 మంది సభ్యులకు డివిడెంట్‌ను 5 గ్రాముల వెండి కాయిన్ రూపంలో పంపిణీ చేశామన్నారు. 65 మంది నూతనంగా సభ్యత్వానికి దరఖాస్తు చేసుకొని రూ.330 సభ్యత్వ రుసుం చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్ బజార్ డైరెక్టర్లు కష్ణమూర్తి, చంద్రశేఖర్ రెడ్డి, సూపర్ బజార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూజలు

ప్రజాశక్తి-పలమనేరు: స్థానిక పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి టిడిపి 6వ వార్డు కౌన్సిలర్ శారదమ్మ సుబ్రహ్మణ్యం గౌడు, 14వ వార్డు కౌన్సిలర్ సునీత నాగరాజు లు పూలమాలలు వేసి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకష్ణదేవరాయల గురించి కొనియాడారు. అనంతరం టిడిపి పట్టణ అధ్యక్షులు కుట్టి మాట్లాడుతూ శ్రీకష్ణదేవరాయలు అందరివాడని తెలిపారు. మీరు చేసే ఏ కార్యక్రమానికైనా తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం మాజీ డిసిసి అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ తాము అందరినీ కలుపుకొని వెళతామని తెలిపారు. టిడిపి కౌన్సిలర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు సుధాకర్, ప్రెసిడెంట్ పిజెసి బాబు, కార్యదర్శి కిరణ్, ఇంటి సంపత్, అమ్ములు, శ్యామ్, సుదర్శన్ బాలాజీ, కోటి, జయశంకర్, భాస్కర్, సోమశేఖర్ నాయుడు, మోహన్, సుబ్రహ్మణ్యం, శ్రీధర్, మదన్, సుధాకర్, జన, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

రథంపై కొలువైన శివపార్వతులు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలో వెలిసిన స్వయంభీస్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శివపార్వతులు రథంపై కొలువుదీరగా భక్తులు రథాన్ని లాగుతూ పురవీధులలో స్వామివారిని ఊరేగించారు. ఉదయం పూజారులు ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆలయంలో నిర్వహించిన అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి వేదమంత్రాల నడుమ రథంపై కొలువు చేర్చారు. మధ్యాహ్నం మడుగుతేరు సందర్భంగా గ్రామంలోని మహిళలు, పిల్లలు, వద్ధులు ఆలయానికి చేరుకొని మడుగుతేరును లాగారు. అనంతరం స్వామి వారి రథాన్ని గ్రామంలోని యువకులు ఆనందోత్సాహాల మధ్య పురవీధులలో ఊరేగించగా భక్తులు కొబ్బరికాయను, కర్పూరాన్ని స్వామివారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అశేష జనవాహిని పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ యూనిట్ - 15 దత్త గ్రామమైన దుర్గ సముద్రంలో ఇంజినీరింగ్ ఈసీఈ విభాగం వాలంటీర్లు, ప్రోగ్రామ్ అధికారిని డా. డి. యువశ్రీ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆరవ రోజున దుర్గసముద్రం గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు, గ్రామ ప్రజలకు చిరుధాన్యాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గహవిజ్ఞాన శాస్త్రం విభాగాధిపతి సహాయాచార్యులు డా. జి. శిరీష మాట్లాడుతూ భారతదేశంలో దీర్ఘకాలిక వ్యాధులు క్రమంగా పెరుగుతున్నాయని, వాటిని అధిగమించడానికి శారీరక వ్యాయామంతో పాటు మనం తినే ఆహారంలో చిరుధాన్యాలను జోడించాలని చెప్పారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సాములు, అరికలు, వరిగ, ఊద, అండుకొర్రలు వంటి చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యవంతులమవుతామని తెలిపారు. వీటిని రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాన ధర్మాలకు ప్రతీక రంజాన్

ప్రజాశక్తి-కార్వేటినగరం: ముస్లిం సోదరులు రంజాన్ పండుగను దాన ధర్మాలకు ప్రతీకగా జరుపుకుంటారు. శనివారం మండల కేంద్రంలోని మసీదులో ముస్లిం సోదరులు చిన్నపెద్ద తేడా లేకుండా నూతన దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అదే విధంగా పేదలకు దాన ధర్మాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ క్రమంలో ఒక్కరినొకరు అలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ సుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సోమల: ముస్లిం సోదరులు మండలంలో రంజాన్‌ను శనివారం ఆనందోత్సాహాల మధ్య భక్తిశ్రద్ధలతో ఘనంగా

జరుపుకున్నారు. కందూరు, సోమల, నంజంపేట, పెద్ద ఉప్పరపల్లి, నవాబుపేట, వంగసాని వారి పల్లి, ఇరికిపెంట గ్రామాలలో ముస్లిం సోదరులు మసీదు వద్ద ప్రార్థనలు చేసి అనంతరం ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం పేదలకు నగదును, మిఠాయిలను పంచిపెట్టారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామం అజా ఖానా జహరాలో ఖురాన్‌లోని భక్తి సందేశాన్ని, అదేవిధంగా ఈద్గా వద్ద ఉపవాసం దీక్ష గురించి మతగురువు మౌలానా అలీ అక్బర్ వివరించారు.

రొంపిచెర్ల: మండలంలో పవిత్ర రంజాన్ పండుగ పర్వదినం

సందర్భంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పండుగను ఘనంగా జరుపుకొని ఆయా గ్రామాలలోని సమీప ఈద్గాల వద్ద మసీదులలో ప్రార్థనలు నిర్వహించారు. శనివారం మండల కేంద్రమైన రొంపిచెర్లలోని ముస్లింలు తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రార్థన లు నిర్వహించారు.

వెదురుకుప్పం: మండలంలోని వేపేరి, పచ్చికాపల్లం, తాటిమాకుల పల్లిలో ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా జరుపుతున్నారు. వేపేరి గ్రామంలో రంజాన్ వేడుకలను మజీద్ ముత్తువల్లీ హుస్సేన్ సాహెబ్ ఆధ్వర్యంలో జరిగింది. మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు.

బంగారుపాళ్యం: ముస్లిం సోదరులు మండలంలోని మొగిలి వెంకటగిరి ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం మండలంలోని ముస్లిం సోదరులు అందరూ ఉదయం మత గురువులు తెలిపిన నియమాలతో ప్రార్థనలు చేసి ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పలమనేరు: ముస్లిం సోదర, సోదరీమణులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలను మాజీ మంత్రి అమరనాథ రెడ్డి తెలియజేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆదోనిలో ఉన్న ఆయన శనివారం ఒక ప్రకటనలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి పవిత్ర రంజాన్ పండుగను జరుపుకుంటున్న ప్రతి ఒక్కరిని ఆ అల్లా చల్లని చూపు చూడాలని ఆకాంక్షించారు.

నగరి: రంజాన్ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజర్ ఖాదర్ భాయ్ ఆధ్వర్యంలో ప్రకాశం రోడ్‌లోని మసీదులో సుమారు 2000 మంది ముస్లిం సోదరులకు శనివారం లడ్డు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ ముస్లిం సోదరులకు లడ్డు పంచి ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి తీరును ఖండించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు పర్యటనను అడ్డగించి రాళ్ళు రువ్విన ఘటనకు బాధ్యులైన మంత్రి ఆదిమూలపు సురేష్ తీరును పట్టణ టీడీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ టీడీపీ నాయకులు మాట్లాడుతూ దళితులైన డాక్టర్ సుధాకర్ నుంచి మొన్నటి డాక్టర్ అచ్చన్న వరకు చనిపోయినప్పుడు మంత్రి సురేష్ ఎక్కడ ఉన్నారో చెప్పాలని నిలదీశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగిపోయాయని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రులు, ఎంపీలు అగ్రవర్ణాల ప్రజా ప్రతినిధుల పక్కన నిలవడం చాలా బాధాకరమన్నారు. చంద్రబాబు హయాంలోనే దళితులకు అత్యంత గౌరవం దక్కిందని మంత్రి సురేష్ గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు గ్యాస్ నాగరాజు, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, మదన్‌మోహన్, అములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మండలంలోని ఎం కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని రామసముద్రం, సన్నీ పల్లి, మునిపల్లి గ్రామాలలో గడపగడపకు మీ ఎమ్మెల్యే కార్యక్రమం శనివారం నిర్వహించారు. పలమనేరు నియోజకవర్గ శాసనసభ్యులు వెంకటేగౌడ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఎం కష్ణమూర్తి, జిల్లా ఎంపీపీ అధ్యక్షులు ఎం రెడ్డప్ప, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, స్థానిక సర్పంచ్ చంద్రమౌళి, ఎంపీటీసీ వినాయకం గ్రామాల్లోని కుటుంబ సభ్యులను కలిసి కరపత్రాలు అందించి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధి పొందిన కుటుంబాలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ పథకాలు మళ్లీ మీకు చేరువ కావాలంటే రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కష్ణమూర్తి తనయులు శైలేష్, చక్రవర్తి, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధిని అందించడమే నా లక్ష్యం: పులివర్తి నాని



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు అభివద్ధిని అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నానని చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. శనివారం మంగళం పంచాయతీలోని మంగళం క్వార్టర్స్ లో పదో రోజు మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పాలనలో వైసిపి నేతలు ఇష్టం వచ్చినట్లు ప్రజల సొమ్మును దోచుకుని తింటున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ సక్రమంగా నెరవేర్చలేదన్నారు. సంక్షేమం మాటున భారీ అవినీతి జరుగుతోందన్నారు. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరల పెంపుతోపాటు చెత్త పన్ను, ఇంటి పన్ను తదితరాల పేరుతో ప్రతి కుటుంబం నుంచి ఏడాదికి కనీసం లక్ష రూపాయిలు దోచుకుంటున్నారన్నారు. విద్యుత్ చార్జీలు ఏడు సార్లు పెంచి పేద ప్రజలను సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నారన్నారు. ఇంతటి ప్రజా వ్యతిరేక విధానాలను గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. రంజాన్ సందర్భంగా స్థానిక ముస్లిం సోదరులకు పులివర్తి నాని ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, అలిమినేని మధు, ఈశ్వరయ్య, సురేష్ నాయుడు, చలపతి, వార్డు సభ్యులు నాగరాజు, రమణ, సూరి, బాలాజీ, రామూర్తి యాదవ్, ధనమ్మ, గోపీనాథ్, భాస్కర్ రెడ్డి, మధుబాబు, ధర్మారెడ్డి, భారతి, లక్ష్మీ, గురుస్వామి, రవి పాల్గొన్నారు.

దామలచెరువు సంతలో 'చెవిరెడ్డి ఉచిత భోజనం'



ప్రజాశక్తి-పాకాల: చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దామలచెరువు వారపు సంతలో రైతులకు 'చెవిరెడ్డి ఉచిత భోజనం' పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దామలచెరువు వారపు సంతలో దాదాపు 250 మంది రైతన్నలు తాము పండించిన పంటలను విక్రయించేందుకు రాగా వందల సంఖ్యలో కొనుగోలుదారులు ఉచిత భోజన కార్యక్రమానికి విచ్చేశారు. ఉదయం 11.30 నుంచి సాయంత్రం 3 గంటల వరకు భోజన పంపిణీ కార్యక్రమం సాగింది. దామలచెరువుతో పాటు పదిపుట్ల బైలు, ఈపాలగుట్ట పల్లి, వల్లివేడు, రమణయ్య గారి పల్లి, మొగరాల నుంచే కాకుండా చిత్తూరు జిల్లా ఐరాల మండలం నుంచి కూరగాయల కొనుగోలుకు ప్రజలు విచ్చేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ విక్రయదారులు, కొనుగోలు దారులు ఆకలి తీర్చేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఉచిత భోజనం, అల్పాహారం అందించారన్నారు. చెవిరెడ్డి ఉచిత భోజనం ప్రక్రియ ఇకపై నిరంతరాయంగ కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య రజనీకి ఉమెన్ అకడమిక్ అచీవర్ అవార్డు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రజనీకి ఉమెన్ అకడమిక్ అచీవర్ అవార్డు వరించింది. ధరిత్రి దినోత్సవం సందర్భంగా రీసెర్చ్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ మరియు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రొడక్షన్ మేనేజ్మెంట్ వారు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు - సస్టైనబుల్ డెవలప్మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ అగ్రికల్చర్, ఐటి, మేనేజ్మెంట్, సోషియల్ సైన్సెస్ అనే అంశంపై ఈ అవార్డును ప్రదానం చేయడం జరిగింది. ఆచార్య రజనీ ఫుడ్ టెక్నాలజీ రంగంలో చేసినటువంటి పరిశోధనలు, సామాజిక కార్యక్రమాలకుగాను ఈ అవార్డును ప్రదానం చేయడం జరిగిందని ఐఐపిఎం డైరెక్టర్ ప్రొఫెసర్ సుదీప్ కుమార్ గోస్ తెలిపారు. వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె. రాజారెడ్డి , టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఆచార్య రజినికి అభినందనలు తెలిపారు.

నియామకం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జిల్లా టిడిపి యాదవ సాధికార కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని వెల్లేపల్లె గ్రామానికి చెందిన పి.శ్రీధర్ యాదవ్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా టిడిపి అధ్యక్షుడు పులివర్తి నాని నుంచి శ్రీధర్ యాదవ్ నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవికి ఎంపిక చేయడానికి సహకరించిన నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడు, పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కష్ణనాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు స్వామిదాస్‌లు, మండల నియోజకవర్గ టిడిపి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గురుసంక్రమణ పూజలు

ప్రజాశక్తి-నగరి: గురుసంక్రమణ పూజలు ఆదివారం కరకంతేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం శనివారం తెలిపారు. గురుసంక్రమణ కారణంగా మేషం, కుంభం, మకరం, వశ్చికం, కన్య, కటకం, వషభం రాశులు పరిహారం చేసుకోవాల్సి ఉంటుందని మీనం, ధనస్సు, తులా, సింహం, మిధునం రాశులు శుభరాశులని పేర్కొన్నారు. పరిహార పూజల్లో భాగంగా శ్రీ మేతా దక్షిణామూర్తులకు అభిషేకం, అర్చన, హారతి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణ సమతుల్యత ప్రగతికి మూలం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, జాతీయ సేవా పథకం యూనిట్-3 దత్తత గ్రామమైన తనపల్లి లో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా శనివారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని, పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు, లింగ సమానత్వం-ప్రగతికి మూలం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. యూనిట్ 3 ప్రోగ్రాం అధికారిని డాక్టర్ నీరజ మాట్లాడుతూ స్త్రీలు ప్రకతితో ప్రత్యేకమైన, సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటారని, లింగ అసమానతలు, ప్రకతి వైపరీత్యాలు రెండూ సుస్థిరాభివద్ధికి అడ్డంకులని, అందుకే ఈ అంశాలపై తక్షణ అవగాహన అవసరమని చెప్పారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివద్ధి లక్ష్యాలలో ఈ రెండు అంశాలకు ప్రత్యేక స్థానం కల్పించిందని వివరించారు. అనంతరం గ్రామ కూడలిలో మానవ హారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక నారద పుష్కరిణి వద్ద ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకురాలు చక్రాల ఉష మాట్లాడుతూ వేసవి తాపం ఎక్కువ అవుతున్న కారణంగా బాటసారులకు, ప్రయాణికులకు భక్తులకు నీరు అందివ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చక్రాల మురళీ మహేష్, జ్ఞానేష్, యుగంధర్, నవ భారత యువజన సంఘ అధ్యక్షుడు గరికపాటి రమేష్ బాబు, కేశవ రాజా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి గాలి భానుప్రకాష్ సంతాపం

ప్రజాశక్తి-నగరి: మున్సిపాలిటీ నెత్తంకండ్రిగకు చెందిన టీడీపీ నాయకుడు పి.ఎం.మునిక్రిష్ణ రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రాత్రి మతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గాలి భాను ప్రకాష్ శనివారం మతుని భౌతికకాయంను సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురిపై రౌడీషీటర్ కేసు నమోదు

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని మేల్బూరు గ్రామంలో ముగ్గురిపై రౌడీ షీటర్ కేసు బాలాయపల్లి ఎస్సై వీరనారాయణ నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు చింతల రవీంద్ర, చింతల శివరాం ప్రసాద్, కాసరం శ్రీరాములపై రౌడీ షీటర్ కేసు నమోదు చేశారు. గ్రామంలో సమస్యాత్మకంగా నేరాలు చేయడంతో రౌడీషీటర్లుగా గుర్తించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

ప్రజాశక్తి -రేణిగుంట: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు.. డీఎస్పీ రామచంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రమణ విలాస్ సర్కిల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు పారిపోతున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి 400 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రేణిగుంట పట్టణానికి చెందిన ఖాదర్ భాషా, విశ్వలుగా గుర్తించామని.. కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.

ఎస్వీసీఈ వార్షికోత్సవ వేడుకల్లో అఖిల్ సందడి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో జోష్-2023 వార్షికోత్సవ వేడుకల్లో సినీ నటుడు అక్కినేని అఖిల్ పాల్గొని సందడి చేశారు. ఈనెల 28న అఖిల్ నటించిన చిత్రం ' ఏజెంట్ ' ప్రమోషన్‌లో భాగంగా కళాశాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో అక్కినేని అఖిల్, ఏజెంట్ చిత్ర కథానాయకి సాక్షివైద్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కినేని అఖిల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి లక్ష్య సాధన కోసం కషి చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవడం అసాధ్యం కాదన్నారు. జోష్ కార్యక్రమంలో భాగంగా కేరాఫ్ కంచరపాలెం చిత్ర సంగీత దర్శకులు శ్వీకర్ అగస్తి తన బందంతో చక్కటి సంగీత విభావరిని అందించి కార్యక్రమానికి మరింత జోష్ తెప్పించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ ప్రకాష్ అంబవరం, కన్వీనర్లు మురళీకష్ణ, లక్ష్మీదేవి, కళాశాల అధ్యాపక బందం విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వడ్డెర జిల్లా కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా వడ్డెర కార్యవర్గ సమావేశం ఈ నెల 23వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు శ్రీకాళహస్తి పట్టణం గోపాలవనంలోని విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు వడ్డెర జేఏసీ అధ్యక్షులు వేముల సుబ్బారావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు తురకా అమరనాథ్, ప్రధాన కార్యదర్శి కోనంగి శ్రీరాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వడ్డెర్ల సమస్యలపై చర్చిస్తామన్నారు. అలాగే తరతరాలుగా వెనుకబడిన వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలనే ప్రధాన డిమాండుతో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు.

స్విమ్స్‌లో పేదలకు ఉచిత వైద్యం అందించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీడీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్స్ ఆసుపత్రిలో పేదలందరికీ ఉచితంగా వైద్యం అందించాలని పీసీసీ సభ్యులు యార్లపల్లి గోపి డిమాండ్ చేశారు. శనివారం నగర పరిధిలోని స్విమ్స్ హాస్పిటల్ వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో స్విమ్స్ ఆసుపత్రిని ప్రారంభించారన్నారు. నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు అపోలో ఆసుపత్రికి అప్పగించాలని నిర్ణయించిన సమయంలో అప్పటి తిరుపతి పార్లమెంటు సభ్యులు చింతామోహన్ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తో చర్చించి ప్రధానమంత్రి నిధుల నుంచి రూ.60 కోట్లను స్విమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారన్నారు. టీటీడీ అనుబంధ సంస్థలలో ఎస్సీలకు 16శాతం, ఎస్టీలకు 7 శాతం, ఓబీసీలకు 27 శాతం ఉద్యోగాల నియామకాలలో అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్విమ్స్ వైద్యాధికారి రామ్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు రవి, పూతలపట్టు ప్రభాకర్, పంటా శ్రీనివాసులు రెడ్డి, పూల చంద్రశేఖర్, పోలా భాస్కర్, రావణ్, తేజోవతి, శాంతి యాదవ్, వెంకటేష్ గౌడ్, పోటుగారి భాస్కర్ పాల్గొన్నారు.